ప్రజా రిపబ్లిక్

ప్రతి అక్షరం ప్రజల కోసం

స్మార్ట్ ఎడిషన్

EVENING 6 PM

సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 155 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు 2 + https:www.prajarepublic.com + వెల - 1/-

శుక్రవారం 10 జనవరి 2025

RNI No: APTEL/2023/87888

Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole

రాజకీయాల్లోకి రావాలంటే బాగా డబ్బు ఉండాలా? : చిన్ననాటి కథ చెప్పిన మోదీ

రాజకీయాల్లో రావాలంటే బాగా డబ్బు ఉండాలా? అని అడిగిన ప్రశ్నకు మోదీ ఆసక్తికర సమాధానమిచ్చారు. ఈ సందర్భంగా తన చిన్నతనంలో కళ్లారా చూసిన కథ చెప్పారు.

జనవరి 10, (రిపబ్లిక్ న్యూస్): పాలనా వ్యవహారాల్లో నిత్యం తలమునకలై ఉండే ప్రధానమంత్రి నరేంద్రమోదీ తొలిసారి ఓ పాడ్కాస్ట్లో పాల్గొన్నారు. ప్రముఖ వ్యాపారవేత్త, జిరోదా సహ వ్యవస్థాపకుడు నిఖిల్ కామత్ నిర్వహిస్తున్న పాడ్కాస్ట్లో అతిథిగా విచ్చేశారు. ఈ ఇంటర్వ్యూకు సంబంధించిన పూర్తి వీడియోను తాజాగా విడుదల చేశారు. ఇందులో నిఖిల్ అడిగిన ప్రశ్నలకు ప్రధాని సమాధానం చెబుతూ పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు.

రాజకీయాల్లోకి రావాలంటే భారీగా డబ్బులు అవసరమా? అని అడగ్గా.. మోదీ తాను చిన్నతనంలో స్వయంగా చూసి తెలుసుకున్న విషయం చెప్పారు. "రాజకీయాల్లోకి వస్తారా అని యువతను అడిగితే అందుకు చాలా డబ్బులు ఉండాలి అని అంటున్నారు. సాధారణంగా ఇండస్ట్రీలో మేం స్టార్టప్ పెట్టాలంటే మా స్నేహితులనో, కుటుంబసభ్యులనో డబ్బులు అడుగుతాం. మరి రాజకీయాల్లో ఎలా?" అని నిఖిల్ కామత్ ప్రధాని. ప్రధాని బదులిస్తూ.. "మా ఊర్లో ఓ డాక్టర్ ఉండేవారు. ఆయన మంచి కంటి వైద్య నిపుణుడు. తన దగ్గరకు వచ్చే వారిని ఎంతో ప్రేమగా, జాగ్రత్తగా చూసుకునేవారు. మంచి వక్త కూడా. ఓసారి ఆయన ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయాలనుకున్నారు. అప్పుడు నేను బాలసేనలో పనిచేస్తున్నా. ఆ వైద్యుడి వద్ద డబ్బులు లేకపోవడంతో తనకు తెలిసిన వారందరి దగ్గరకు వెళ్లి రూపాయి రూపాయి విరాళం తీసుకున్నారు. ఆ డబ్బుతో ఎన్నికల్లో పోటీ చేశారు. కేవలం రూ.250 మాత్రమే ఖర్చు చేశారు. అయినప్పటికీ ఎన్నికల్లో విజయం సాధించారు" అని మోదీ నాటి సంఘటనను వివరించారు. "ఈ సమాజం వాస్తవాలను అంగీకరించదు అనేది నిజం కాదు. మనకు ఓపిక, అంకితభావం ఉండాలి. ఓట్ల కోసం ఏదైనా చేస్తామనుకునే కాంట్రాక్ట్ విధానాన్ని వదులుకోవాలి. అలాంటి వైఖరితో మీరు విజయం సాధించలేరు. ఈ ప్రజాస్వామ్య సమాజంలో ఓటరు కూడా ఓ రాజకీయ నాయకుడే. ఓటు వేసేటప్పుడు వారు ఎంతో ఆలోచించి నిర్ణయం తీసుకుంటారు" అని మోదీ వ్యాఖ్యానించారు.

'బ్రాండ్ ఆంధ్రప్రదేశ్' ఇప్పుడిప్పుడే ముందుకెళ్తాంది : సీఎం చంద్రబాబు

గత పాలకులు అన్ని రంగాలనూ పతనావస్థకు తీసుకొచ్చారని.. రాష్ట్రాన్ని సమస్యల వలయంగా మార్చేశారని ఏపీ సీఎం చంద్రబాబు విమర్శించారు.

గుంటూరు, జనవరి 10, (రిపబ్లిక్ న్యూస్): గత పాలకులు అన్ని రంగాలనూ పతనావస్థకు తీసుకొచ్చారని.. రాష్ట్రాన్ని సమస్యల వలయంగా మార్చేశారని ఏపీ సీఎం చంద్రబాబు విమర్శించారు. పడకేసిన నిర్మాణ రంగాన్ని మళ్లీ పైకి తీసుకొస్తామన్నారు. గుంటూరులోని చేబ్రోలు హనుమ-య్య మైదానంలో నరెడ్కో ప్రాపర్టీ షోను సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

"కొత్త ఏడాది నిర్మాణ రంగం వేగంగా అభివృద్ధి చెందాలని కోరుకుంటున్నా. గత ప్రభుత్వ హయాంలో ఈ రంగం అధ్వానంగా మారింది. ప్రజలు మమ్మల్ని నమ్మి 93శాతం స్ట్రైక్ రేట్తో విజయం కట్టబెట్టారు. అధికారంలోకి రాగానే రాష్ట్ర పునర్ నిర్మాణం ప్రారంభించాం. ప్రధాని మోదీ విశాఖకు వచ్చి రూ.2లక్షల కోట్ల అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. బ్రాండ్ ఆంధ్రప్రదేశ్ ఇప్పుడిప్పుడే ముందుకెళ్తాంది. నిర్మాణ రంగం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాం. ఈ రంగంపై 34 లక్షల మంది ఆధారపడి ఉన్నారు. ఉచిత ఇసుక విధానం తెచ్చి నిర్మాణ రంగానికి ఊతమిచ్చాం. నరెడ్కో, క్రెడాయ్ వంటి సంస్థలు కలిసి ముందుకు రావాలి. రియల్ ఎస్టేట్ సమస్యల పరిష్కారానికి ముందుంటాం. వైకాపా పాలనలో అన్నింటికంటే ఎక్కువగా నిర్మాణ రంగం దెబ్బతింది. అధికారంలోకి రాగానే ఈ రంగానికి ప్రాధాన్యత ఇచ్చాం. ఎప్పుడూ చూడనివిధంగా భూ సమస్యలపై దరఖాస్తులు వస్తున్నాయి. వైకాపా ప్రభుత్వం చేసిన అక్రమాలే దీనికి ముఖ్య కారణం. భూ కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకుంటాం. గత ప్రభుత్వ నిర్వాకంతో టీడీఆర్ బాండ్లు తీసుకుని కొంతమంది నష్టపోయారు. స్వర్ణాంధ్ర విజన్ డాక్యుమెంట్ సాధన కోసం కృషి చేస్తున్నాం. మేం వచ్చాక రూ.4లక్షల కోట్ల పెట్టుబడులకు సంతకాలు చేశాం. ఐదేళ్లలో 20లక్షల మందికి ఉపాధి కల్పించాలనేదే మా లక్ష్యం" అని చంద్రబాబు అన్నారు.

అందుకే మనస్ఫూర్తిగా క్షమాపణ కోరా: పవన్ కల్యాణ్

ఆవు బాగుంటే రైతు బాగుంటాడని.. రైతు బాగుంటే దేశం బాగుంటుందని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు.

పిఠాపురం, జనవరి 10, (రిపబ్లిక్ న్యూస్): ఆవు బాగుంటే రైతు బాగుంటాడని.. రైతు బాగుంటే దేశం బాగుంటుందని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. గత ఐదేళ్ల వైకాపా పాలనలో 268 గోకులం షెడ్లు నిర్మిస్తే.. ఆరు నెలల్లో తాము 12,500 నిర్మించామని చెప్పారు. కాకినాడ జిల్లా పిఠాపురం మండలం కుమారపురంలో గోకులం షెడ్లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పవన్ మాట్లాడారు.

"గోకులాల ద్వారా చిన్న, కౌలు రైతులు, ఇతర వర్గాలు బాగుపడతాయి. భవిష్యత్తులో 20వేల గోకులాలు ఏర్పాటు చేస్తాం. గత ప్రభుత్వం పాడి పరిశ్రమను నిర్వీర్యం చేసింది. స్కామ్లో రికార్డు సృష్టించింది. మా ప్రభుత్వం పల్లె పండుగ, గోకులాలతో అభివృద్ధి కార్యక్రమాలు చేసింది. సకాలంలో జీతాలు, పింఛన్లు పంపిణీ చేస్తున్నాం. శ్రమ ఉన్న చోటే పెట్టుబడులు వస్తాయి. రైతుల ఆదాయం రెట్టింపయ్యేలా ఆలోచనలు చేస్తున్నాం. ఎన్డీయే, చంద్రబాబు నాయకత్వాన్ని నమ్మి మీరంతా ఓట్లు వేశారు. ఎక్కడ తప్పు జరిగినా స్పందించే గుణం ఉండాలి. తప్పు జరిగితే అది మా అందరి సమష్టి బాధ్యత. అందుకే తిరుపతి తొక్కిసలాట ఘటనపై స్పందించాను... మనస్ఫూర్తిగా క్షమాపణ కోరా.

ఎలా స్పందించాలో తెలియాలి..

ఎక్కడ ఎలా స్పందించాలో అభిమానులకు తెలియాలి. ప్రమాద సమయాల్లో కేరింతలు అనవసరం. కేరింతలు.. అరుపులు కాదు.. పోలీసులకు సహకరించాలి. తిరుపతి ఘటన చూశాం.. ఎవరి బాధ్యత వాళ్లు సరిగా చేస్తే సరిపోయేది. కొంతమంది చేసిన తప్పునకు జిల్లా పోలీసు యంత్రాంగం మొత్తం ఫలితం అనుభవించాల్సి ఉంటుంది. ఉద్యోగి, అధికారి.. ఎవరైనా వారి బాధ్యతలు సరిగా నిర్వర్తించాలి. గత ప్రభుత్వంలో అలవాటుపడి కొంతమంది పనిచేయడం మానేశారు. న్యాయం అందరికీ జరిగేలా చూడటం ముఖ్యం. తప్పు చేస్తే నన్ను కూడా శిక్షించాలని అసెంబ్లీలో చెప్పా. రాజ్యాంగం ఇచ్చిన విధులను సంపూర్ణంగా పరిరక్షించాలని మనస్ఫూర్తిగా అధికారులను కోరుతున్నా. చాలా పెద్ద మనసుతో.. గొడ్డు చాకిరీ చేయడానికి వచ్చా.

తితిదే ఛైర్మన్, సభ్యులు క్షమాపణ చెప్పాలి

నాకు అధికారం అలంకారం కాదు.. బాధ్యత. ఎవరైనా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే తొక్కి నార తీస్తా. చేయని తప్పునకు జపాన్ ప్రధాని క్షమాపణ చెప్పారు. తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే) ఛైర్మన్, సభ్యులు ప్రెస్మీట్ పెట్టి క్షమాపణలు చెప్పాలి. నేను క్షమాపణ చెప్పినప్పుడు.. మీరు చెప్పడానికి ఏంటి నామోషీ? మీ తప్పు లేదంటే ఎలా? నేను మాత్రం దోషిగా నిలబడాలా? వీఐపీ ట్రీట్మెంట్ తగ్గి.. కామన్ మ్యాన్ ట్రీట్మెంట్ పెరగాలి.

విప్లవకారుడు రాజకీయ నాయకుడైతే ఇలాగే ఉంటుంది

నాతో సహా అందరికీ 6 నెలల పాలన పూర్తయింది. మీరు నన్ను నమ్మి గెలిపించారు... నిలబెట్టి పనిచేయిస్తాను. ఒళ్లు వంచి పని చేసిన తర్వాతే ఓట్లు అడుగుతాను. 15 ఏళ్లకు తక్కువ కాకుండా కూటమి ఉండాలని కోరుకుంటున్నా. అధికార యంత్రాంగం సహకారం కావాలి. పిఠాపురం నుంచి జిల్లాల పర్యటన మొదలు పెడుతా. బాధ్యతగా ఉంటాను.. నాయకులను కలుపుకొని వెళ్తాను. విప్లవకారుడు రాజకీయ నాయకుడైతే ఇలాగే ఉంటుంది. నాకు డబ్బు, పేరు మీద ఇష్టం లేదు. బాధ్యత మాత్రమే ఉంది. నాకు దేవుడు అవ-సరమైనంత డబ్బు, పేరు ఇచ్చాడు. ప్రజలు ఆనందంగా ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా" అని పవన్ అన్నారు.

అధికార యంత్రాంగం వైఫల్యాన్ని సీఎం ప్రశ్నించారు: మంత్రి ఆనం

తిరుపతి తొక్కిసలాట ఘటనలో అధికార యంత్రాంగం వైఫల్యాన్ని సీఎం చంద్రబాబు ప్రశ్నించారని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు.

నెల్లూరు, జనవరి 10, (రిపబ్లిక్ న్యూస్): తిరుపతి తొక్కిసలాట ఘటనలో అధికార యంత్రాంగం వైఫల్యాన్ని సీఎం చంద్రబాబు ప్రశ్నించారని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. ఈ ఘటనలో ఆరుగురు మృతిచెందగా.. 35 మందికి గాయాలయ్యాయని చెప్పారు.

క్షతగాత్రులకు రుయా ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స అందించి స్విమ్స్ తరలించినట్లు చెప్పారు. చనిపోయిన ఆరుగురికి వెంటనే పోస్టుమార్టం నిర్వహించినట్లు మంత్రి వివరించారు. రెవెన్యూ అధికారి సమక్షంలో మృతదేహాలను స్వస్థలాలకు తరలించామన్నారు. నెల్లూరులో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆనం రామనారాయణ రెడ్డి మాట్లాడారు. "స్పృహ తప్పిన మహిళను బయటకు తీసుకెళ్లే సమయంలో తొక్కిసలాట జరిగిందని కొంతమంది చెప్పారు. టోకెన్లు ఇస్తున్నారన్న ఆతృతతో అందరూ ఒక్కసారిగా గేట్ల మీద పడ్డారు. ఒకవైపు తెరవాల్సిన గేట్లు.. మ-రోవైపు తెరవడంతో తొక్కిసలాట జరిగినట్లు చాలామంది తెలిపారు. సుమారు గంటన్నరపాటు 35 మంది క్షతగాత్రులను సీఎం వ్యక్తిగతంగా కలిశారు. ఏం చేస్తే త్వరగా కోలుకుంటారని వైద్యులను కూడా సీఎం అడిగారు. బాధిత కుటుంబాలకు అండగా ఉండాలని రూ.25 లక్షల చొప్పున సాయం ప్రకటించారు" అని మంత్రి వివరించారు.

ఇతర దేశాల్లోని నగరాలకు పోటీనిచ్చేలా ఫ్యూచర్ సిటీ: సీఎం రేవంత్

రాష్ట్రాన్ని రైజింగ్ తెలంగాణగా అభివృద్ధి చేయడమే తన కల అని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు.

హైదరాబాద్, జనవరి 10, (రిపబ్లిక్ న్యూస్): రాష్ట్రాన్ని రైజింగ్ తెలంగాణగా అభివృద్ధి చేయడమే తన కల అని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. హైటెక్ సిటీలోని సీఐఐ గ్రీన్ బిజినెస్ సెంటర్లో సీఐఐ జాతీయ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించి మాట్లాడారు.

హైదరాబాద్లో ఫోర్త్ సిటీ.. ఫ్యూచర్ సిటీని నిర్మించాలని నిర్ణయించుకున్నామన్నారు. ఇతర దేశాల్లోని నగరాలతో ఫ్యూచర్ సిటీ పోటీ పడుతుందని చెప్పారు. హైదరాబాద్ను కాలుష్య రహితంగా చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొన్నారు."3,200 ఈవీ బస్సులను ఆర్టీసీలోకి తీసుకువస్తున్నాం. ఎలక్ట్రిక్ వాహనాలకు రిజిస్ట్రేషన్, రోడ్డు పన్నును తొలగించాం. ప్రకృతి విపత్తులను ఎదుర్కోవడానికి హైదరాబాద్ సిద్ధవ-వుతోంది. వరదలు లేని నగరంగా తీర్చిదిద్దాలనుకుంటున్నాం. ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ను అనుసంధానించే రేడియల్ రోడ్లు నిర్మించబోతున్నాం. ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ మధ్య ప్రాంతం తయారీ రంగానికి కేంద్రంగా ఉండబోతుంది. నైపుణ్యాలు, ఉద్యోగాల కల్పనపై ప్రధానంగా దృష్టి సారించాం. రాష్ట్రానికి తీరప్రాంతం లేదు.. అందుకే డ్రైపోర్టు ఏర్పాటు చేయనున్నాం. పెట్టుబడులు పెట్టేందుకు ప్రభుత్వంతో కంపెనీలు కలిసి వస్తే అద్భుతాలు సృష్టించవచ్చు" అని రేవంత్రెడ్డి తెలిపారు.

హైదరాబాద్ పోలీసుల భారీ ఆపరేషన్.. 23 మంది సైబర్ నేరగాళ్ల అరెస్టు

సైబర్ నేరగాళ్ల కోసం హైదరాబాద్ పోలీసులు భారీ ఆపరేషన్ చేపట్టారు.

హైదరాబాద్, జనవరి 10, (రిపబ్లిక్ న్యూస్): సైబర్ నేరగాళ్ల కోసం హైదరాబాద్ పోలీసులు భారీ ఆపరేషన్ చేపట్టారు. ఏపీ, కర్ణాటక, యూపీ, గుజరాత్ రాష్ట్రాల్లో ప్రత్యేక ఆపరేషన్ చేపట్టి 23 మంది సైబర్ నేరగాళ్లను అరెస్టు చేశారు. వీరిపై తెలంగాణాలో 30, దేశవ్యాప్తంగా 328 కేసులు నమోదయ్యాయి. నిందితుల నుంచి సెల్ఫోన్లు, చెక్కుక్లు, సిమ్కార్డులను స్వాధీనం చేసుకున్నారు.

ఇందుకు సంబంధించిన వివరాలను సైబర్ క్రైమ్ డీసీపీ కవిత వెల్లడించారు. సైబర్ నేరాలు చేస్తున్న ముఠాను యూపీలో పట్టుకున్నట్లు చెప్పారు. 5 ప్రత్యేక బృందాలతో 23 మంది సైబర్ నేరగాళ్లను అరెస్టు చేసినట్లు చెప్పారు. వీరు వివిధ నేరాల్లో మొత్తం రూ.5.29 కోట్లు కాజేశారన్నారు. 5 రాష్ట్రాల్లో ప్రత్యేక ఆపరేషన్ నిర్వహించినట్లు తెలిపారు. అక్కడి పోలీసుల సాయంతో అధునాతన సాంకేతికతను వాడి పట్టుకున్నట్లు చెప్పారు. నిందితులు దేశవ్యాప్తంగా ట్రేడింగ్, ఉద్యోగాల పేరిట మోసాలకు పాల్పడ్డారని వివరించారు. ఈ ముఠాలో ఓ మహిళ కీలకంగా వ్యవహరించినట్లు పేర్కొన్నారు."3 కేసుల్లో రూ.39 లక్షలు స్వాధీనం చేసుకున్నాం. 70 ఏళ్ల వృద్ధుడు ఇచ్చిన ఫిర్యాదుతో ఓ మహిళను అరెస్టు చేశాం. ఆమె దిల్లీలో ఎన్జీవో నడుపుతున్నట్లు గుర్తించాం. డబ్బులకు ఆశపడి నిందితురాలు ఎన్జీవో ఖాతాను సైబర్ నేరగాళ్లకు ఇచ్చింది. ఆధారాలను చూపించి ఆమెను అరెస్టు చేసి హైదరాబాద్కు తీసుకువచ్చాం. ప్రజలు అనుమానిత కాల్స్, మెసేజ్ లు వస్తే స్పందించకూడదు. వాటికి స్పందిస్తే ఖాతా నుంచి డబ్బులు పోయే ప్రమాదముంది" అని కవిత తెలిపారు.

printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్పెషల్

చరిత్రలో నేటి ప్రత్యేకత

- **1863:** లండనులో భూగర్భరైల్వే ప్రారంభం.
- **1894:** తెలుగు కవి పింగళి లక్ష్మీకాంతం జననం (మ.1972).
- **1920:** నానాజాతి సమితిలో భారతదేశం సభ్యత్వం పొందింది.
- **1940:** భారతీయ సినిమా నేపథ్యగాయకుడు, సంగీత విద్వాంసుడు కె. జె. ఏసుదాసు జననం.
- **1946:** ఐక్యరాజ్యసమితి సాధారణ సభ తొలి సమావేశం లండనులోని వెస్ట్‌మినిస్టర్ సెంట్రల్‌హాలులో జరిగింది. ఈ సమావేశానికి మొత్తం 51 దేశాలు హాజరయ్యాయి.
- **1972:** తెలుగు కవి పింగళి లక్ష్మీకాంతం మరణం (జ.1894).
- **1973:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మొదటి సారిగా రాష్ట్రపతి పాలన విధించబడింది.

భూగర్భరైల్వే


పింగళి లక్ష్మీకాంతం

నానాజాతి సమితి

కె. జె. ఏసుదాసు

వెస్ట్‌మినిస్టర్ సెంట్రల్‌హాలు


పింగళి లక్ష్మీకాంతం


రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి

అప్పుడు ఒకింత నిరాశకు గురయ్యా : డాల్బీ టెక్నాలజీపై రాజమౌళి

అన్నపూర్ణ స్టూడియోస్లో డాల్బీ టెక్నాలజీ అందుబాటులోకి వచ్చింది. ప్రముఖ దర్శకుడు రాజమౌళి దీనిని ప్రారంభించారు.



అన్నపూర్ణ స్టూడియోస్ సరికొత్త చరిత్ర సృష్టించింది. భారతదేశంలోనే మొట్టమొదటిసారి ఇక్కడ డాల్బీ టెక్నాలజీ అందుబాటులోకి వచ్చింది. డాల్బీ సర్టిఫికేట్తో కూడిన పోస్ట్ ప్రొడక్షన్ సౌకర్యాన్ని ఇక్కడ ఏర్పాటుచేశారు. ప్రముఖ దర్శకుడు రాజమౌళి గురువారం దీనిని ప్రారంభించారు. భారతీయ చలనచిత్ర నిర్మాణం, ఆడియో విజువల్ ప్రమాణాలను పునర్నిర్వచించడం, ప్రపంచ ప్రమాణాలకు అనుగుణంగా సినిమాటిక్ అనుభూతిని అందించడమే లక్ష్యంగా దీనిని ఏర్పాటుచేశారు. ఇందులోభాగంగా రాజమౌళి మాట్లాడుతూ 'ఆర్ఆర్ఆర్' రోజులు గుర్తుచేసుకున్నారు. "ఆర్ఆర్ఆర్ను డాల్బీ విజన్లో ప్రేక్షకులకు అందించాలని భావించినప్పుడు.. ఆ టెక్నాలజీ మన దేశంలో అందుబాటులో లేదు. దాంతో ఆ వర్క్ పూర్తి చేయడం కోసం మేము జర్మనీ వెళ్లాల్సివచ్చింది. స్వదేశంలోనే డాల్బీ విజన్లో నా సినిమాను అనుభూతి చెందలేకపోయినందుకు కొంచెం నిరాశకు గురయ్యా. కానీ, ఇప్పుడు అన్నపూర్ణ స్టూడియోస్లో దీనిని ఏర్పాటుచేయడం ఎంతో సంతోషంగా ఉంది. నా తదుపరి సినిమా రిలీజ్కు వచ్చే సమయానికి దేశంలో చాలాచోట్ల డాల్బీ విజన్ అందుబాటులోకి రానుంది. డాల్బీ విజన్లో సినిమా చూడటం ఓ విభిన్నమైన అనుభూతిని అందిస్తుంది. విజువల్స్లో వచ్చే క్లారిటీ కథను మరో స్థాయికి తీసుకువెళ్తుంది. ప్రేక్షకులందరూ దీనిని అనుభూతి చెందాలని కోరుకుంటున్నా" అని అన్నారు. అనంతరం నాగార్జున మాట్లాడారు. ఇండియన్ సినిమాకు సంబంధించి కొత్త టెక్నాలజీ అందుబాటులోకి తీసుకువచ్చేందుకు తమ స్టూడియోస్ ఎప్పుడూ ముందుంటుందని ఆయన అన్నారు. "భారతీయ సినిమా ఖ్యాతిని పెంచడం కోసం మేము ఎప్పుడూ వర్క్ చేస్తుంటాం. అందుకు అనుగుణంగానే మా స్టూడియోస్ 50వ ఏడాదిలోకి అడుగు పెట్టిన ఈసందర్భంలో దీనిని ప్రారంభించాం. అందుకు ఎంతో సంతోషంగా ఉంది" అని తెలిపారు. ఇదొక గేమ్ఛంజింగ్ టెక్నాలజీ కానుందని సుప్రియా యార్లగడ్డ అన్నారు. ఇందులోభాగంగా 'ఆర్ఆర్ఆర్'కు సంబంధించిన స్పెషల్ ఫుటేజ్ను ఇక్కడ ప్రదర్శించారు. సినిమా ప్రమాణాలు పెంచి ప్రేక్షకులకు విభిన్నమైన అనుభూతిని అందించేందుకు ఈ డాల్బీ విజన్ ఉపయోగపడుతుంది. డాల్బీ లేబొరేటరీస్ దీనిని రూపొందిస్తుంటుంది.

రిపబ్లిక్ సినిమా CINEMA

క్లారిటీ ఇచ్చి మరింత దిగజారారు..

90 గంటల పనిపై దీపికా మరో పోస్ట్

90 గంటల పనిపై దీపికా మరోసారి స్పందించారు. ఎల్ అండ్ టీ కంపెనీ ఇచ్చిన క్లారిటీపై ఆమె మరో పోస్ట్ పెట్టారు.

వారానికి 90 గంటలు పాటు పని చేయాలని, ఆదివారం సెలవునూ వదిలేయాలని ఎల్ అండ్ టీ ఛైర్మన్ ఎస్.ఎన్. సుబ్రహ్మణ్యం చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. దీనిపై సోషల్ మీడియాలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నెటిజన్లు వారి అభిప్రాయాలను వ్యక్తపరుస్తున్నారు. మరోవైపు సెలబ్రిటీలు కూడా దీనిపై స్పందిస్తున్నారు. ఈ వ్యాఖ్యలపై తాజాగా బాలీవుడ్ అగ్ర కథానాయిక దీపికా పదుకొణె అసహనం వ్యక్తంచేస్తూ పోస్ట్ పెట్టారు. అలాగే ఛైర్మన్ వ్యాఖ్యలపై ఆ కంపెనీ ఇచ్చిన వివరణపై కూడా ఆమె మరో పోస్ట్ పెట్టారు. "ఇంట్లో కూర్చుని ఏం చేస్తారు. ఎంతకాలం అలా భార్యను చూస్తూ ఉండిపోతారు. ఇంట్లో తక్కువ సమయం, ఆఫీస-ంలో ఎక్కువ సమయం ఉంటామని భార్యలకు చెప్పాలి" అంటూ ఎల్ అండ్ టీ ఛైర్మన్ ఎస్.ఎన్. సుబ్రహ్మణ్యం చేసిన వ్యాఖ్యలు నెట్టింట్లో వైరల్ అయ్యాయి. దీనికి సంబంధించిన పోస్ట్ను నటి దీపిక షేర్ చేస్తూ అసహనం వ్యక్తం చేశారు. "ఉన్నత హోదాలో ఉన్న వ్యక్తి ఇలాంటి వ్యాఖ్యలు చేయడంతో ఆశ్చర్యానికి గురయ్యా" అని పేర్కొన్నారు. తన పోస్ట్కు అనే హ్యాష్ ట్యాగ్ను జోడిస్తూ వ్యక్తికి మానసిక ఆరోగ్యం చాలా ముఖ్యమని గుర్తుచేశారు. ఈ క్రమంలోనే సుబ్రహ్మణ్యం చేసిన వ్యాఖ్యలపై కంపెనీ వివరణ ఇవ్వగా.. దానిపైనా నటి స్పందించారు. 'ఈ క్లారిటీ ఇచ్చి మరింత దిగజారారు' అని రాసుకొచ్చారు. ఎల్ అండ్ టీ ఛైర్మన్ ఎస్.ఎన్.సుబ్రహ్మణ్యం చేసిన వ్యాఖ్యలపై కంపెనీ స్పష్టతనిచ్చింది. 'ఎనిమిది దశాబ్దాలుగా జాతి నిర్మాణమే ఎల్ అండ్ టీకి ప్రధాన లక్ష్యంగా ఉంది. భారత మౌలిక వసతులు, పరిశ్రమలు, సాంకేతిక సామర్థ్యాలను ఎల్ అండ్ టీ మెరుగుపరిచింది. అభివృద్ధి చెందిన దేశంగా ఎదిగే క్రమంలో అసాధారణ లక్ష్యాలను చేరాలంటే అసాధారణ కృషి అవసరం. ఈ విస్తృత లక్ష్యాన్నే ఛైర్మన్ వ్యాఖ్యలు ప్రతిబింబిస్తాయ'ని కంపెనీ ప్రతినిధి ఒకరు వివరణ ఇచ్చారు. ప్రస్తుతం దీనిపై కూడా నెట్టింట చర్చ నడుస్తోంది.

రిపబ్లిక్ స్పోర్ట్స్ SPORTS

నా ఫ్యామిలీని వేధించాడు..

అందుకే గంభీర్ 'హిపోక్రెట్' :మనోజ్ తివారీ

ఆసీస్ చేతిలో సిరీస్ ఓటమితో భారత ప్రధాన కోచ్ గంభీర్ పై తీవ్ర స్థాయిలో విమర్శలు వస్తున్నాయి. మాజీ క్రికెటర్ మనోజ్ తివారీ కూడా ఘాటుగా స్పందించాడు.

భారత క్రికెట్ జట్టు ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ పై ఒకప్పటి సహచరుడు మనోజ్ తివారీ తీవ్రసా-థ్యయిలో విరుచుకుపడుతున్నాడు. ఇప్పటికే గంభీర్ను 'హిపోక్రెట్గా'గా అభివర్ణించిన తివారీ.. అందుకుగల కారణాలను వెల్లడించాడు. 2015 రంజీ ట్రోఫీ సమయంలో తనకు, గంభీర్ మధ్య వాగ్వాదం చోటుచేసుకున్నట్లు గుర్తు చేసుకున్నాడు. పైకి ఒకటి మాట్లాడే గంభీర్.. దానిని అస్సలు పాటించడని అందుకే కపట వ్యక్తి అంటూ మరోసారి తివారీ వ్యాఖ్యానించాడు. "నేనెందుకు గంభీర్ను హిపోక్రెట్ అని పిలుస్తాను? ఎందుకంటే అతడు గతంలో ఇచ్చిన ఇంటర్వ్యూల్లో మాట్లాడిన మాటలే అందుకు కారణం. 'విదేశాల నుంచి వచ్చే కోచ్లకు ఎలాంటి భావోద్వేగాలు ఉండవు. అనుభూతులు ఉండవు. డబ్బు సంపాదించుకోవడానికి వస్తారు. ఎంజాయ్ చేసి వెళ్తారు' అని గంభీర్ అన్నాడు. ఇప్పుడు తాను ప్రధాన కోచ్గా ఉన్నప్పుడు భారత్కు చెందినవారిని సహాయక కోచ్లుగా తీసుకోవచ్చు కదా.. కానీ, రైన్ టెన్ డస్కెటే, మోర్నీ మోర్కెల్ను తీసుకున్నాడు. గంభీర్ చేసే పనులకు.. చెప్పే మాటలకు పొంతన ఉండదు. అందుకే అలా పిలుస్తా" అని వెల్లడించాడు.

కోచ్గా అనుభవం లేకపోతేనే ఇలా..

"గంభీర్ ప్రధాన కోచ్ సాధించిన ఫలితాలను ప్రతిఒక్కరూ చూస్తున్నారు. అత్యంత తక్కువ వ్యవధిలోనే ఎక్కువ టెస్టుల్లో జట్టు ఓడింది. బోర్డర్- గావస్కర్ ట్రోఫీని కోల్పోయాం. కివీస్తో స్వదేశంలో సిరీస్ను కోల్పోయాం. ఆసీస్పై అంటే ఓకే కుర్రాళ్లు ఉన్నారు.. స్టార్ బ్యాటర్లు విఫలమయ్యారు. మరి స్వదేశంలో సిరీస్ సంగతేంటి? ఇక్కడ ఓడిపోవడం మాత్రం ఆమోదయోగ్యం కాదు. కానీ, క్రికెట్లో గెలుపోటములు సహజం. కానీ, ఓడినప్పుడు ఏం జరిగిందనే దానిపై సమీక్షించుకోవాలి. అప్పుడే మరోసారి అవి పునరావృతం కాకుండా ఉంటాయి. రాహుల్ ద్రావిడ్ జట్టుకు అద్భుత విజయాలు అందించి ఆ బ్యాటన్ను గంభీర్కు అందించాడు. ముందుకుతీసుకెళ్లాల్సిన గంభీర్ దాన్ని వెనక్కి మళ్లిస్తున్నట్లు అనిపిస్తోంది. కోచింగ్లో అనుభవం లేకపోవడమే దీనికి కారణం" అని తివారీ వ్యాఖ్యానించాడు.

ఆ రెండూ ఒకటి కాదు..

"ప్రధాన కోచ్గా బాధ్యతలు చేపట్టకముందు గంభీర్ ఏమైనా అనుభవం ఉందా? కనీసం ఫస్ట్ క్లాస్ క్రికెట్ లేదా ఐపీఎల్లో ఎక్కడైనా కోచ్గా చేశాడా? అంటే అదీలేదు. జట్టుకు మెంటార్గా ఉండటం.. కోచ్గా ఉండటం చాలా భిన్నం. అభిమానులతోపాటు చాలామంది విశ్లేషకులు ఈ రెండింటినీ కలిపి చెప్తారు. కానీ, అలా కాదు. అందుకే, అనుభవం లేనప్పుడు అతడి నుంచి మనం ఫలితం ఎలా ఆశిస్తాం? భవిష్యత్తులోనైనా మార్పు రావాలంటే కాస్త సమయం పడుతుంది. ఈలోగా గంభీర్ తన పొరపాట్ల నుంచి నేర్చుకోవాలి. లేకపోతే మాత్రం మరింతకాలం కొనసాగడం కష్టమే" అని తెలిపాడు.

నాపైనే కాదు.. గంగూలీపైనా వ్యాఖ్యలు

"రంజీ ట్రోఫీ 2015 సీజన్లో గంభీర్ నాకు వాగ్వాదం జరిగింది. ఢిల్లీ వేదికగా ఓ మ్యాచ్ జరిగింది. అప్పుడు గంభీర్ నోటినుంచి దారుణమైన పదాలు వచ్చాయి. నా కుటుంబసభ్యులపైనా నోరు పారేసుకున్నాడు. నన్నే కాదు.. సౌరభ్ గంగూలీని కూడా వదల్లేదు. ఏవో చెత్త పదాలు వాడాడు. ఆ సమయంలో ఇతర క్రికెటర్లు అతడిని కాపాడారు. లేకపోతే పరిస్థితి విభిన్నంగా ఉండేది" అని వ్యాఖ్యానించాడు.

ఇంటి చిట్కాలు

బొప్పాయితో పాటు ముఖంపై ముడతలు తగ్గించి అందాన్ని పెంచే పండ్లు, ఎప్పుడు తినాలంటే

చిన్న వయసులోనే ముఖంపై ముడతలు రావడం వెనుక చాలా కారణాలు ఉండవచ్చు. వీటిలో సరైన ఆహారం తీసుకోకపోవడం, వ్యాయామం లేకపోవడం, అధిక ఒత్తిడి వంటి కారణాలు ఉంటాయి. ముడతల సమస్య, వృద్ధాప్య ఛాయల్ని తగ్గించడం కోసం సరైన జీవనశైలితో పాటు సరైన ఆహారం తీసుకోవడం చాలా ముఖ్యం.

ప్రతి ఒక్కరూ అందంగా ఉండాలని కోరుకుంటారు. అయితే, ఈ రోజుల్లో లైఫ్స్టైల్, కాలుష్యం, అనారోగ్యకర ఆహారపు అలవాట్లు అనేక చర్మ సమస్యలకు కారణమవుతున్నాయి. ఇక, వయసు పెరిగే కొద్దీ ముఖంపై ముడతలు రావడం కామన్ ప్రాబ్లమ్. అయితే, చాలా మంది చిన్న వయసులోనే ముఖంపై ముడతలు వచ్చి ముసలి వారిలా కనిపిస్తున్నారు. దీంతో.. చాలా మంది ఆందోళన చెందుతున్నారు. చిన్న వయసులోనే ఇలా ఎందుకు జరుగుతుందని ఆలోచిస్తున్నారు. చిన్న వయసులోనే ముఖంపై ముడతలు రావడం వెనుక చాలా కారణాలు ఉండవచ్చు. వీటిలో సరైన ఆహారం తీసుకోకపోవడం, వ్యాయామం లేకపోవడం, అధిక ఒత్తిడి వంటి కారణాలు ఉంటాయి. ముడతల సమస్య, వృద్ధాప్య ఛాయల్ని తగ్గించడం కోసం సరైన జీవనశైలితో పాటు సరైన ఆహారం తీసుకోవడం చాలా ముఖ్యం. ఆహారంలో కొన్ని పండ్లను భాగం చేసుకోవాలి. ఈ పండ్లు తినడం వల్ల ముఖంపై ముడతలు తగ్గి అందం రెట్టింపు అవుతుందని నిపుణులు చెబుతున్నారు. ఇంతకీ ఆ పండ్లు ఏంటంటే..

బొప్పాయి

బొప్పాయి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. ఇది చర్మం ఆరోగ్యంలో కూడా కీలక పాత్ర పోషిస్తుంది. ఇందులో ఫోలిక్ యాసిడ్, పొటాషియం, మెగ్నీషియం, విటమిన్ ఎ, విటమిన్ సి, వంటి ఎన్నో ముఖ్యమైన పోషకాలు ఈ పండులో ఉన్నాయి. ఇవి చర్మ ఆరోగ్యానికి మేలు చేస్తాయి. బొప్పాయిలో ఉండే పపైన్ ఎంజైమ్ చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచడంతోపాటు వృద్ధాప్య సమస్యను తగ్గిస్తుంది. బొప్పాయిలో ఉండే విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు ముఖంపై ముడతల్ని తగ్గిస్తాయి. ప్రతి రోజూ ఉదయాన్నే ఖాళీ కడుపుతో బొప్పాయి తింటే ఈ ప్రయోజనాలు రెట్టింపు అవుతాయని నిపుణులు చెబుతున్నారు.

అరటి పండు

అరటి పండు ఆరోగ్యానికి చేసే మేలు గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. అరటిలో అధిక మొత్తంలో పొటాషియం, విటమిన్లు ఉన్నాయి. అంతేకాకుండా ఎన్నో పోషకాలు అరటి పండు తినడం వల్ల లభిస్తాయి. ఇవి చర్మాన్ని ఆరోగ్యంగా, మెరుస్తూ ఉండటానికి సాయపడతాయి. అరటి పండు తినడం వల్ల చర్మంపై ముడతలు తగ్గుతాయి. అంతేకాకుండా బ్లడ్ షుగర్, కొలెస్ట్రాల్, ఫ్యాటీ లివర్ మొదలైన సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. అరటి పండును బ్రేక్ ఫాస్ట్ తర్వాత, సాయంత్రం తింటే మంచిది.

యాపిల్

యాపిల్లో సహజ చక్కెర, ఫ్రక్టోజ్ ఉన్నాయి. యాపిల్లో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. అందుకే ఉదయాన్నే ఖాళీ కడుపుతో యాపిల్ తింటే చర్మ ఆరోగ్యం మెరుగుపడుతుంది. చర్మాన్ని ముడతలు పడకుండా కాపాడటంతో పాటు రోజంతా ఎనర్జిటిక్ గా ఉంచుతుంది. యాపిల్లో ఉండే యాంటీఆక్సిడెంట్లు, ఫైబర్ చర్మాన్ని ఆరోగ్యంగా, ముడతలు లేకుండా ఉంచడంలో సహాయపడతాయి.

ద్రాక్ష

ద్రాక్ష పండ్లలో చర్మానికి మేలు చేసే ఎన్నో గుణాలు ఉన్నాయి. ఈ పండులో ఉంటే విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. ద్రాక్ష పండు తినడం వల్ల ముఖంపై ముడతలు తొలగిపోయి చర్మం కాంతివంతంగా మారుతుంది. ద్రాక్ష పండును బ్రేక్ ఫాస్ట్ తర్వాత లేదా మధ్యాహ్నం తింటే మేలు.

ఇవి కూడా ముఖ్యం

చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవడం కోసం పై చెప్పిన పండ్లతో పాటు కొన్ని జాగ్రత్తలు కూడా తీసుకోవాలి. హైడ్రేట్గా ఉండటం తప్పనిసరి. అందుకోసం తగినంత నీళ్లు తాగండి. ఆహారంలో పండ్లతో పాటు గింజలు, నట్స్ కూడా యాడ్ చేసుకోండి. బాదం, వాల్ నట్స్, గుమ్మడి గింజలు వంటివి డైట్లో భాగం చేసుకోవాలి. వీటితో పాటు తగినంత నిద్ర, వ్యాయామాన్ని కూడా అలవాటు చేసుకుంటే చర్మంపై ముడతలు తగ్గుతాయని నిపుణులు చెబుతున్నారు.

గమనిక: ఇది సోషల్ సమాచారం మాత్రమే. కొన్ని అధ్యయనాలు, సంబంధిత నిపుణుల ప్రకారం ఈ వివరాలు అందించాం. వ్యక్తుల ఆరోగ్యాన్ని బట్టి ఫలితాలుంటాయి. వీటిని పాటించేముందు.. సంబంధిత నిపుణుడిని సంప్రదించడం శ్రేయస్కరం. అలాగే, హెల్తీ లైఫ్ స్టైల్, సరైన ఆహారం కూడా తీసుకోవడం మీ ఆరోగ్యానికి ఎంతో మేలు.